క్లుప్తంగా

నకరికల్లు ఎస్‌ఐగా నాగేందరరావు



నకరికల్లు: గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేవిధంగా ప్రజలందరూ కలసిమెలసి ఉండాలని ఎస్‌ఐ కె.నాగేందరరావు కోరారు. నకరికల్లు ఇన్‌చార్జి ఎస్‌ఐగా శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఎస్‌ఐ పి.రాంబాబు సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జి ఎస్‌ఐగా నాగేందరరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. సిబ్బంది గ్రామాలపై గట్టి నిఘా ఉంచాలన్నారు. శాంతియుత వాతావరణం కోసం శాంతి కమిటీల సహకారం అవసరమన్నారు.

నేడు ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ

సత్తెనపల్లి: పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో ఆదివారం మధ్యాహ్నం 12:21 గంటలకు హైందవ సామ్రాజ్య వ్యవస్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ జరుగుతుందని ఆర్య క్షత్రియ, ఆరె మరాఠ సంఘం సభ్యులు శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటలకు ఫిరోజి బుషీంద్రుల వారి మఠం నుంచి తారక్ ఛత్రపతి నాట్య కళా నిలయం శ్రీ తేనేటి కరుణాకర్ మాస్టార్‌తో మహారాష్ట్ర వీధి వరకు కోలాటం, నృత్యం, మేళతాళాలతో ఊరేగింపు ఉంటుందన్నారు. ఉదయం 9 గంటలకు కాషాయం ధ్వజ పూజ, 9:30 గంటలకు తుల్జా భవాని అమ్మవారి పూజ, 10 గంటలకు తుల్జా భవాని అమ్మవారి హోమం జరుగుతాయన్నారు. 12:21 గంటలకు ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ, 12:33 గంటలకు అన్న సంతర్పణ కార్యక్రమం జరుగుతుందన్నారు. అధిక సంఖ్యలో ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పాఠ్య, నోట్ పుస్తకాలు సిద్ధం



క్రోసూరు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కావాల్సిన పాఠ్య, నోట్ పుస్తకాలు సిద్ధంగా ఉన్నట్లు ఎంఈఓ ఏకుల ప్రసాదరావు శనివారం తెలిపారు. 12 ప్రాథమిక, 38 ప్రాథమికోన్నత, ఏడు జిల్లా పరిషత్, కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్(59) విద్యార్థులకు వీటిని అందివ్వనున్నట్లు చెప్పారు. ఆయా పాఠశాలల్లో బాలికలు 3,060, 2,710 మంది బాలురు మొత్తం 5,770 మంది విద్యార్థులున్నట్లు తెలిపారు. ఒక తొమ్మిదవ తరగతి పాఠ్య పుస్తకాలు మినహా అన్నీ పాఠ్య పుస్తకాలు వచ్చినట్లు చెప్పారు. వీటిని విద్యాశాఖ ఆదేశాల మేరకు త్వరలో ఆయా పాఠశాలలకు అందించటం జరుగుతుందన్నారు.

ఆత్మహత్యకు పాల్పడిన యువకుడి మృతి

ముప్పాళ్ల: కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని నార్నెపాడు గ్రామానికి చెందిన మేరిగ రవిబాబు (30)కు చిలకలూరిపేటకు చెందిన రజనితో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగు సంవత్సరాల పాప ఉంది. అయితే కుటుంబ కలహాలతో రెండేళ్ల క్రితం రజని తన పుట్టింటికి వెళ్లిపోయింది. తన భార్య తనతో ఉండటం లేదనే మనస్తాపంతో రవిబాబు గత నెల 26న మద్యం సేవించి, తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొన ఊపిరితో ఉన్న రవిబాబును గమనించిన బంధువులు అతడిని నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రవిబాబు పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న రవిబాబు శనివారం సాయంత్రం మృతి చెందాడు. కేసును ఎస్‌ఐ హజరతయ్య దర్యాప్తు చేస్తున్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులపై చర్యలు తీసుకోండి

నరసరావుపేట: ఫిట్‌నెస్ లేని విద్యాసంస్థల బస్సులపై చర్యలు తీసుకోవాలని, నిబంధనలు పాటించని బస్సులను సీజ్ చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్‌ఐ) పల్నాడు జిల్లా కార్యదర్శి కోట సాయికుమార్ కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జూన్ ఒకటో తేదీ నుంచి కళాశాలలు ప్రారంభం కాగా, 12వ తేదీ నుంచి పాఠశాలలు జిల్లా వ్యాప్తంగా ప్రారంభమవుతున్నాయని తెలిపారు. కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు చెందిన బస్సులు సరైన ఫిట్‌నెస్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా అధిక మంది విద్యార్థులను ఎక్కించుకొని ప్రయాణిస్తున్నా యన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల తరఫున ఆటోలో పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్తున్న వాటిపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు.

సర్పంచ్‌గా ప్రసాదరావు బాధ్యతల స్వీకరణ

దాచేపల్లి: మండలంలోని కేసానుపల్లి సర్పంచ్(ఇన్‌చార్జి)గా శ్రీపతి ప్రసాదరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు వ్యక్తిగత కారణాలతో సెలవు పెట్టారు. పంచాయతీ కార్యదర్శి నాగెండ్ల రత్నం ప్రసాదరావుతో ప్రమాణస్వీకారం చేయించారు. పలువురు నూతన సర్పంచ్‌ను అభినందించి, సన్మానించారు. రామకోటయ్య, కోటయ్య, హనుమంతరావు పాల్గొన్నారు.

మలేరియాతో తస్మాత్ జాగ్రత్త

- అశ్రద్ధ చేస్తే తీవ్ర జ్వరంతో ప్రాణాలకు ముప్పు
- మలేరియా నివారణ అవగాహన మాసంగా జూన్



ర్యాలీ ద్వారా అవగాహన కల్పిస్తున్న మలేరియా, మున్సిపల్ సిబ్బంది

సత్తెనపల్లి: జిల్లాలో వాతావరణ పరిస్థితులు మారిన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు పొంచి ఉన్నాయి. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, లేదంటే దోమకాటుతో విష జ్వరాల బారిన పడే ప్రభావం ఉందని మలేరియా అధికారులు సూచిస్తున్నారు. అనాఫిలిస్ అనే దోమ కాటు వల్ల మలేరియా జ్వరం వ్యాపిస్తుంది. నిల్వ ఉన్న నీటితో పాటు తాగునీటిలో కూడా ఈ దోమ వృద్ధి చెందుతుంది. ఈ దోమ వల్ల వచ్చిన జ్వరం 10 నుంచి 14 రోజుల పాటు ఉండి వాంతులు కూడా అవుతుంటాయి. మలేరియా సోకిందంటే ఒక పట్టాన తగ్గదు. కొన్ని సందర్భాల్లో మరణాలూ సంభవిస్తాయి. గత ఏడాది జిల్లాలో నలుగురు మలేరియా, 239 మంది డెంగీ బారిన పడగా.. ఈ ఏడాది ఇద్దరు మలేరియా, 114 మంది డెంగీ బారిన పడ్డారు. ఈ నేపథ్యంలో మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఏటా జూన్ నెలను యాంటీ మలేరియా మాసంగా ప్రకటించారు.

దోమలు పెరగకుండా జాగ్రత్తలు..

ఇంటి పరిసరాల్లో దోమలు పెరిగేందుకు ఆస్కారం లేకుండా మురుగు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. పరిసరాల పరిశుభ్రతతో పాటుగా వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలి. ప్రతి శుక్రవారం వారానికి ఒకసారి ఇంటిలో నీటి నిల్వలు లేకుండా డ్రైడే పాటించాలి. ఇంటి ఆవరణలో ఖాళీ కొబ్బరి చిప్పలు, కొబ్బరి బోండాలు, పాత టైర్లు, రోళ్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. ఇళ్లల్లోని ఫ్రిజ్‌లు, కూలర్లలో వారానికి ఒకసారి నీటిని మార్చాలి. దోమలు ఇళ్లల్లోకి రాకుండా నియంత్రించేందుకు ఉదయం, సాయంత్రం వేళల్లో కిటికీలు, తలుపులు మూసి ఉంచాలి. లెట్రిన్ పైపులకు పైన వస్త్రాన్ని కట్టి ఉంచాలి. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా దోమ తెరలు వాడటం ద్వారా దోమకాటు బారిన పడకుండా కాపాడుకోవచ్చు.



గాబుల్లో నీటి నిల్వలను పారబోస్తున్న ఆశ కార్యకర్తలు

మలేరియా లక్షణాలు..

మలేరియా వ్యాధి అనాఫిలిస్ అనే దోమ కాటు వల్ల వస్తుంది. వర్షా కాలంలో దోమలు పెరిగే ప్రదేశాలు ఎక్కువ అవ్వడంతో ఈ వ్యాధి ఎక్కువగా ప్రబలుతుంది. చలి, వణుకుతో కూడిన విపరీతమైన జ్వరం, ఒళ్లు నొప్పులు, మూత్రం మందగించడం, లివర్, కడుపులో నొప్పి, జ్వరం రెండుమూడు రోజులకోసారి లేదా రోజు మార్చి రోజు వస్తూ ఉండడం ఈ వ్యాధి లక్షణాలు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణ గంట వ్యవధిలోపు ప్రకటిస్తున్నారు. అనంతరం క్లోరోక్విన్, ప్రైమాక్విన్ అనే మాత్రలను ఇస్తారు. ఈ మందులన్నీ కూడా ఉచితంగా అందిస్తారు. న్యూ డ్రగ్ పాలసీ – 2012 ప్రకారం తప్పనిసరిగా 14 రోజులు ఈ మందులు వాడాలి.

ప్రజల భాగస్వామ్యం ముఖ్యం



ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నియంత్రణ సాధ్యమవుతుంది. జూన్ నుంచి మలేరియా, డెంగీ జ్వరాలు నమోదయ్యే అవకాశం ఉన్న దృష్ట్యా ప్రజలు వ్యాధులపై అవగాహన కలిగి ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా దోమలు పుట్టకుండా.. కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి. ప్రత్యేక అవగాహన కార్య క్రమాలు నిర్వహిస్తున్నాం. మలేరియా కేసులు నమోదైన గ్రామాల్లో మలాథియన్ ఫాగింగ్, యాంటీ లార్వా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా వ్యాధి నిర్ధారణ ఉచితంగా చేసి మందులు అందిస్తున్నాం. ముఖ్యంగా సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేసి అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలు కూడా పూర్తిస్థాయిలో సహకరిస్తే సీజనల్ వ్యాధులను పూర్తి స్థాయిలో అరికట్టవచ్చు.

–కె.రవీంద్ర రత్నాకర్, జిల్లా మలేరియా అధికారి, పల్నాడు.

ప్రభుత్వ బడి.. ప్రవేశాల సందడి

- పాఠశాలల్లో మెరుగైన వసతులు
- కార్పొరేట్‌కు దీటుగా ఫలితాలు
- చేరేందుకు విద్యార్థుల ఆసక్తి
- ప్రవేశాలపై ఉపాధ్యాయుల ప్రత్యేక దృష్టి



పెదమక్కెనలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

సత్తెనపల్లి: విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేసి, మెరుగైన వసతులు కల్పించడం.. బోధనలో ప్రత్యేక మార్పులు తీసుకురావడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలలో వచ్చిన ఫలితాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ విద్యార్థుల అడ్మిషన్లపై ఫోకస్ పెట్టారు. ఉన్నత పాఠశాల పరిధిలో ఉన్న సమీప గ్రామాలు ప్రాంతాలకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పాలని తల్లిదండ్రులను కోరుతున్నారు. విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, ఉచిత పుస్తకాలు, ఇతర సామగ్రిని వివరిస్తున్నారు. ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులు సాధించిన ఫలితాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. 10వ తరగతి ఫలితాలకు సంబంధించి మెరిట్ విద్యార్థుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలు పాఠశాలల వద్ద ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేలా మండల విద్యాశాఖ అధికారులకు ప్రధానోపాధ్యాయులకు ఉన్నతాధికారులు మార్గదర్శకత్వం చేస్తున్నారు.

12న పాఠశాలల పున: ప్రారంభం

ప్రభుత్వ పాఠశాలలు ఈ నెల 12న పునఃప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉంటున్నాయి. నాణ్యమైన విద్య లభిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో తమ బిడ్డలను చేర్పించేలా తల్లిదండ్రులు చొరవ చూపాలి.

–ఎ.శ్రీనివాసరావు, ఎంఈఓ, సత్తెనపల్లి

షర్మిలపై విమర్శలు తగదు



మాట్లాడుతున్న యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి

పెదకూరపాడు: కాంగ్రెస్ పార్టీకి ఆంధ్రప్రదేశ్‌లో పునర్వైభవం తెచ్చేందుకు రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఎంతో కృషి చేస్తున్నారని, పార్టీకి సహకరించాల్సింది పోయి బహిర్గతంగా మీడియా ముఖంగా ఆమెపై వ్యాఖ్యలు చేస్తున్నారని పల్నాడు జిల్లా యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఘంటా గోపి ఆరోపించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయడమే షర్మిల లక్ష్యమన్నారు. వార్డు మెంబర్లుగా గెలవలేని వారు షర్మిలపై విమర్శలు చేయడం సరి కాదని హితవు పలికారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తే పార్టీని బజారుకు ఈడుస్తారా అంటూ విమర్శించారు. పార్టీలో కోవర్టులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొల్లారం సుభాని, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రామోజీరావు మృతి రాష్ట్రానికి తీరని లోటు



రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కన్నా నాగరాజు, నాయకులు

సత్తెనపల్లి: రామోజీ గ్రూప్ సంస్థల చైర్మన్ చెరుకూరి రామోజీరావు మృతి రాష్ట్రానికి తీరని లోటును మిగిల్చిందని గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు అన్నారు. పట్టణంలోని రఘురామ్ నగర్‌లో గల టీడీపీ కార్యాలయంలో శనివారం రామోజీ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికా రంగానికి జవసత్వాలు చేకూర్చేలా ప్రమాణాలు, భాషా నైపుణ్యాల పెంపుదలకు నిరంతరం శ్రమించారన్నారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామ స్వామి, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

హరిత ది గ్రీన్ పార్క్ ఆధ్వర్యంలో...

పట్టణంలోని రఘురామ్ నగర్‌లో గల హరిత ది గ్రీన్ పార్క్ కార్యాలయంలో హరిత ఇన్ ఫ్రా మేనేజింగ్ పార్టనర్ కొలసాని సాంబశివరావు ఆధ్వర్యంలో రామోజీ గ్రూప్ సంస్థల చైర్మన్ చెరుకూరి రామోజీరావు మృతికి శనివారం సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామోజీరావు సేవలను పలువురు కొనియాడారు. ముందుగా రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో నందా సాంబశివరావు, కోమటినేని శ్రీనివాసరావు, మన్నవ వెంకట్రామయ్య, శారద, పాల్గొన్నారు.

ఘనంగా శనీశ్వరస్వామి దేవస్థాన వార్షికోత్సవాలు



వినుకొండ(నూజెండ్ల): రెండు తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటిసారిగా ఆగమన శాస్త్ర విధి విధానాలతో నిర్మాణం జరిగి వైభవంగా పూజలు అందుకుంటున్న మహిమాన్విత శ్రీ జేష్టలక్ష్మీ సమేత శ్రీ శనీశ్వర స్వామి దేవస్థాన ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా రెండో రోజు శనివారం అమ్మవారి ఊరేగింపు కనులపండుగా చేపట్టారు. ఉదయం 7 గంటల నుంచి ఆదివారం ఉదయం 7 గంటల వరకు 24 గంటల పాటు అఖండ శివ ఏకనామ భజన నిర్వహిస్తున్నారు. పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు జానపాటి పరమేశ్వరరావు, కూరాకుల రాము, రావెళ్ల శ్రీనివాసరావు, పేరూరు సాయికుమార్, అట్లూరి ప్రసాద్, మల్లికార్జున, శ్రీకాంత్, రఘురాం, వెంకటలక్ష్మయ్య, కాశీనాథ్, మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఐదు గ్రామాల్లో భద్రత కట్టుదిట్టం

ఎస్‌ఐ ఎం.ఆంజనేయులు



మంచికల్లులో గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ ఎం.ఆంజనేయులు

రెంటచింతల: మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎస్‌ఐ ఎం.ఆంజనేయులు తెలిపారు. జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు తుమృకోట, రెంటాల, పాలువాయి గేటు, మంచికల్లు, జెట్టిపాలెం గ్రామాల్లో ప్రత్యేక దళాలు, ఏఆర్ పోలీసు సిబ్బందితో పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శనివారం పికెట్ ఏర్పాటు చేసిన గ్రామాల ప్రజలతో ఆయన మాట్లాడారు. సమస్యాత్మక గ్రామాల పరిస్థితిని ఎప్పటికప్పుడు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నామన్నారు. ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు ఈ గ్రామాల్లో ఏలాంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణం నెలకొనడానికి ప్రజలందరూ పోలీసులకు పూర్తిగా సహకరించాలని కోరారు. రౌడీ షీట్ ఉన్న వారి పిల్లలు ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాల్లో చాలా ఇబ్బంది పడతారని అర్థమయ్యేలా వివరించారు. ఆవేశంతో చేసే పనులు మంచి కన్నా చెడు జరగడానికి అవకాశం ఎక్కువ ఉంటుందన్న విషయాన్ని గ్రహించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ఫలితాలకు సంబంధించి విద్వేష పూరిత సందేశాలు, ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం 110 మంది ప్రత్యేక దళాలు, మరో 30 మంది ఏఆర్ పోలీసు సిబ్బందితో 5 గ్రామాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

ఇంటిలో పడిన క్రికెట్ బాలు గురించి అడిగితే దాడి

- దాడిచేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలి
- కోరిన పీడీఎం నాయకులు, బాధితులు

నరసరావుపేట: ఇంట్లో పడిన క్రికెట్ బాలును గురించి అడిగినందుకు కోలా నరేష్ బాబు, శ్రీలక్ష్మి, ఏ.వెంకటసుబ్బారావులపై దాడిచేసిన నిందితులపై కేసు నమోదుచేసి వెంటనే అరెస్ట్ చేయాలని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) నాయకులు కోరారు. జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్ వలి, కార్యదర్శి డి.రామకృష్ణ, బాధితులు శనివారం ఒక ప్రకటన ద్వారా సంఘటన వివరాలను తెలియచేశారు. బరంపేటలోని ఇస్కాన్ టెంపుల్ వెనుక కూరగాయల బజారులో బాధితులు, దాడిచేసిన వ్యక్తులు ఎదురెదురు ఇళ్లల్లో నివాసం ఉంటున్నారన్నారు. ఈనెల నాల్గోతేదీన క్రికెట్ బాలు మా ఇంట్లో పడింది ఏమిటని ప్రశ్నించినందుకు ఎదురు ఇంటిలో నివాసం ఉండే పసుపులేటి ప్రసాద్, ఆర్.కొండ, బాబి, కళ్యాణ్, సింగరాజు శివప్రసాద్ ఇంటి మీద దాడిచేసి తీవ్రంగా కొట్టారన్నారు. బాధితులు వెంటనే స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్‌కి వెళ్లి చికిత్స పొందారన్నారు. హాస్పిటల్ డ్యూటీ డాక్టర్ రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు ఫోన్‌చేసి తెలియ చేయడంతో పోలీసులు వచ్చి బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకున్నారన్నారు. ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. నిందితులు తాము అధికార జనసేన, టీడీపీ పార్టీల వాళ్లమని బాధితులను బెదిరిస్తున్నారని, పై అధికారులు వెంటనే జోక్యం చేసుకొని తగిన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

వర్షపు నీరు నిల్వ ఉంచొద్దు

పారిశుద్ధ్య అధికారులకు కమిషనర్ సూచన



నరసరావుపేట: రోడ్డుపై పడిన వర్షపు నీరు నిల్వ ఉండకుండా డ్రెయిన్‌లోకి వెళ్లేవిధంగా పారిశుద్ధ్య అధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఒకటో వార్డు చంద్ర బాబు నాయుడు కాలనీ, 34వ వార్డు బరంపేట పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. రోడ్లపై నీరు నిల్వ ఉండటాన్ని గమనించి పారిశుద్ధ్య అధికారులను ప్రశ్నించారు. వర్షపునీరు నిల్వ ఉండకుండా గుంతలను పూడ్చాలన్నారు. ఇళ్ల యజమానులు సైతం నీరు రోడ్లకు ఇరువైపులా ఉండే డ్రెయిన్లలోకి వెళ్లేందుకు సహకరించాలని కోరారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రామకోటయ్య, వెంకటేశ్వర్లు, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ నాయక్, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతుల్లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

రెంటచింతల: అనుమతులు లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ బోయపాటి బ్రహ్మారెడ్డి హెచ్చరించారు. శనివారం స్థానిక విత్తన విక్రయ దుకాణాల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. క్రయ, విక్రయాలకు సంబంధించిన రికార్డులు, వివిధ రకాల కంపెనీలకు చెందిన విత్తన ప్యాకెట్లను పరిశీలించి, మాట్లాడారు. లైసెన్స్ తీసుకోకుండా రైతులకు విత్తనాలను విక్రయించడం చట్టరీత్యా నేరమని చెప్పారు. దుకాణ నిర్వాహకులు ప్రతి సంవత్సరం ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎవరైనా అనుమతులు లేని విత్తనాలు విక్రయిస్తే వారిపై విత్తన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు అడిగిన విత్తనాలను మాత్రమే ఎమ్మార్పీ ధరలకు ఇవ్వాలని సూచించారు. ధరల విషయంలో రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే.. సదరు షాపు యజమానులపై శాఖ పరమైన చర్యలు తీసుకుని, దుకాణాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. 25 నుంచి 35 రకాల కంపెనీలకు చెందిన విత్తనాలను పరిశీలించామని ఏఓ వెల్లడించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో కంపెనీ, రకం, లాట్ నంబరుతో సహా కొనుగోలు రశీదుపై రాయించుకుని పంట దిగుబడి వచ్చే వరకు కూడా దానిని భద్రపరుచుకోవాలని సూచించారు. ఏఓ వెంట వీఏఏలు గొంటు కృష్ణారెడ్డి, సతీష్, వెంకటేష్ తదితరులున్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో చోరీ

వెండి వస్తువులు అపహరణ



ఆలయంలోని వెండి వస్తువులు అపహరించుకు వెళ్తున్న నిందితుడు

నరసరావుపేట టౌన్: అయ్యప్పస్వామి ఆలయంలో వెండి వస్తువులు అపహరించుకు వెళ్లిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. సత్తెనపల్లి రోడ్డులోని అయ్యప్పస్వామి దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తి శనివారం తెల్లవారు జామున ప్రవేశించి చోరీకి పాల్పడ్డాడు. ఆలయంలోని వెండి శఠగోపం, ప్లేటు, తీర్థం గిన్నెలను అపహరించుకు వెళ్లాడు. చోరీ చేసిన దృశ్యాలను సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. సమాచారం అందుకున్న రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్‌ఐ రోశయ్య సంఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. ఆలయ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లభ్యమైన సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడి కోసం గాలిస్తున్నారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మాచవరం : ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పిన్నెల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన చౌడబోయిన బొబ్రయ్య(58) గత మూడేళ్లుగా తనకు ఉన్న 80 సెంట్ల స్థలంతో పాటు నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. గత రెండేళ్లుగా పంట దిగుబడి రాక నష్టాల పాలయ్యాడు. సుమారు రూ.12 లక్షల వరకు అప్పులు కావడంతో వాటిని తీర్చలేనన్న మనస్థాపంతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడి కొడుకు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎంలో కార్డులు ఏమార్చి నగదు అపహరణ

శావల్యాపురం: మండలంలోని బొందిలిపాలెం గ్రామానికి చెందిన తురగ నాగరాజుకు చెందిన ఏటీయం కార్డు ద్వారా రూ. 25 వేలు నగదు సైబరు నేరగాడు అపహరణ చేసిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు మేరకు నరసరావుపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎస్‌బీఐ ఏటీఎం సెంటరులో నగదు డ్రా చేయటానికి వెళ్లగా అవగాహన లేకపోవటంతో ఏటీఎం సెంటరు నందు గుర్తు తెలియని వ్యక్తి వచ్చి నేను మీకు సహాయం చేస్తాను చెప్పగా నమ్మిన నాగరాజుకు చెందిన ఏటీఎం కార్డును గుర్తు తెలియని వ్యక్తికి ఇచ్చి ఏటీఎం కార్డు పిన్‌కోడ్ నంబరు చెప్పాడు. అయితే పలుమార్లు ప్రయత్నం చేసినా నగదు రాకపోవటంతో తన దగ్గర నకిలీ కార్డును నాగరాజుకు అందజేశారు. ఈక్రమంలో శనివారం నాగరాజుకు చెందిన సెల్‌ఫోను నగదు డ్రా చేసినట్లు సందేశం వచ్చింది. విషయాన్ని నరసరావుపేట పట్టణ పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా ఏటీఎం సెంటరులో సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా నిందితుడిని త్వరలో గుర్తిస్తామన్నారు.

దొంగల బారి నుంచి పంటలను కాపాడాలి



పంట పొలాలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

శావల్యాపురం: పొలాల్లో ఆరబెట్టిన పంటలను దొంగల బారి నుంచి కాపాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము డిమాండ్ చేశారు. మండలంలోని పోట్లూరు గ్రామంలోని గడిపూడి ప్రసాద్ అనే రైతు నాలుగు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని పొగాకు పంటను సాగు చేయగా ఆ పొలంలో పండిన పొగాకును తాళ్లకు గుచ్చి పొలంలో వేసిన పాకాలో తాళ్లను కట్టి ఉండగా గురువారం రాత్రి సుమారు 5 నుంచి 6 క్వింటాళ్ల పొగాకు తాళ్లను దొంగలు దోచుకెళ్లారు. ఉదయాన్నే వచ్చిన ప్రసాద్ పొలంలో చూడగా పొగాకు తాళ్లు కనిపించలేదు. వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది. విషయం తెలుసుకున్న రాము సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి రైతుకు న్యాయం చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో రైతు నాయకులు పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, గ్రామరైతులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో అందని పాఠ్య పుస్తకాలు



అమరావతి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇంకా మండలానికి పూర్తిస్థాయిలో చేరలేదు . 41 ప్రాథమిక, 7 ఉన్నత, 9 ప్రాథమికోన్నత పాఠశాల్లో గతేడాది 4,928 మంది విద్యాభ్యాసం చేశారు. ఈ ఏడాది ఆ సంఖ్య 3,967గా ఉంది. వీరికి 32,000 వేల పాఠ్య పుస్తకాలు అవసరం. మరో నాలుగు రోజుల్లో బడులు తెరుస్తున్నప్పటికి 12,000 పుస్తకాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇంకా 20 వేల పుస్తకాలు రావాల్సి ఉంది. సంబంధిత అధికారులు మిగిలిన పుస్తకాలు అందుబాటులోకి తేవటంపై దృష్టి సారించి, బడులు తెరిచే నాటికి పూర్తిస్థాయిలో పుస్తకాలు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.